## ప్రాణం తీసిన ఈత సరదా

లక్ష్మణచాంద, ఏప్రిల్ 20: సరదా కోసం ఈతకు వెళ్లి లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన మద్దెల రాంచరణ్(13) మృతిచెందాడు. రాంచరణ్ స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని వాగులోకి ఈతకు వెళ్లాడు. సరస్వతీ కాలువ ద్వారా సదర్మాట్‌కు నీటిని విడుదల చేయడంతో వాగులో నీటి ఉధృతి పెరిగింది. రాంచరణ్ వాగు మధ్యలోకి వెళ్లాడు. నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. స్నేహితులంతా భయంతో ఇండ్లకు వెళ్లిపోయారు. సాయంత్రమైనా కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు వివరాలు కనుక్కొని వాగులోకి స్నానానికి వెళ్లారని తెలుసుకున్నారు. అతని చెప్పులు వాగు వద్ద కనిపించాయి. వాగులో గల్లంతయ్యాడని తెలుసుకున్నారు. ఆదివారం మృతదేహం లభించింది. ఘటనా స్థలం వద్ద కుటుంబసభ్యుల రోదనలు గ్రామస్తులను కంట తడి పెట్టించాయి. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మాలిక్ రహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


కోవ ప్రకాశ్(ఫైల్)

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని పులిమడుగు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం సాలేవాడ(కే) గ్రామానికి చెందిన కోవ ప్రకాశ్(47), దత్తు బైక్‌పై ఇంద్రవెల్లికి వెళ్తున్నారు. పులిమడుగు సమీపంలో మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైకు బలంగా ఢీకొట్టింది. దీంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో కోవ ప్రకాశ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో స్థానికులు అంబులెన్స్‌లో రిమ్స్ దవాఖానకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 20: లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ బాబాపూర్ మధ్యలో కారు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం ద్విచక్రవాహనంపై సుంకె భీమరాజం, మానాల రాజేశ్వర్ నిర్మల్‌కు వస్తుండగా వీరిని కారు ఢీకొన్నది. ఇద్దరికి గాయాలవడంతో వారిని 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం

జైనథ్, ఏప్రిల్ 20 : భోరజ్ మండలంలోని డోల్లారా గ్రామంలో పెన్‌గంగా సమీపంలో ఆదివారం అనుమానాస్పంద స్థితిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. పోసులు తెలిపిన వివరాల ప్రకారం..పెన్‌గంగా నది సమీపంలో ఎన్‌హెచ్-44కు దాదాపు 5 మీటర్ల దూరంలో ఓ యువకుడి మృతదేహం కనిపించింది. 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, ఛాతి భాగంలో కత్తితో పొడిచిన కాట్లు ఉండి, పేగులు బయటికి వచ్చి ఉన్నాయి. ముఖంపై కత్తితో పొడిచిన గాయాలు, ముఖం కనిపించకుండా బండతో కొట్టినట్లు ఉన్నాయి. మృతుడు నల్లని కలరు షర్ట్ వైట్ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపి పెన్‌గంగా ఒడ్డున పడేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు జైనథ్ పోలీస్ స్టేషన్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పురుషోత్తం వివరించారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే జైనథ్ సీఐ 8712659916, ఎస్ఐ 8712659929 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## బాసర ఘాట్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

బాసర, ఏప్రిల్ 20 : బాసర గోదావరి ఘాట్ వద్ద ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. గోదావరి ఘాట్ వద్ద మృతదేహం లభ్యమైందని, మృతుడి వివరాలు తెలియలేదని, సంబంధికులు బాసర పోలీస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. లేదా 8712659540 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

భైంసాటౌన్, ఏప్రిల్ 20: మండలంలోని తిమ్మాపూర్ సమీపంలో శనివారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ శంకర్ తెలిపారు. మహిళ వయస్సు 40 నుంచి 45 వరకు ఉంటుందని, చేతిపై నేతాజీ అనే పచ్చబొట్టు, పొడుగు చేతుల నల్ల షర్ట్, ఎరుపు రంగు చీర ధరించి ఉన్నట్లు తెలిపారు. ఢీకొట్టిన వాహనానికి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మృతదేహన్ని గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని భైంసా ఏరియా దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

## అభివృద్ధిని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- మాజీ మంత్రి జోగు రామన్న


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఏప్రిల్ 20 : అభివృద్ధిని పక్కనపెట్టి బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వార్థపూరిత రాజకీయాలు చేస్తున్నాయని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో చేపట్టిన చేరికల కార్యక్రమంలో గణేశ్ నాయుడు ఆధ్వర్యంలో ఖానాపూర్, అంబేద్కర్ కాలనీలకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ మంత్రి జోగు రామన్న కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో పక్క రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచిందన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిందన్నారు. బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు యువతకు కల్పిస్తామని చెప్పి యువతను అల్లర్ల పాలు చేస్తున్నారని ఆరోపించారు. అందుకే యువత స్వచ్ఛందంగా బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన సంక్షేమాన్ని మరచి స్వార్థపూరిత రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అశ్రాఫ్, సాజిత్ ఉద్దీన్, ఇజ్జగిరి అశోక్, దమ్మపాల్, ఏజాజ్, దేవుదాస్, ఉగ్గే విఠల్, దయానంద్, ఇమ్రాన్, వాసీమ్, మహేశ్, సోహెల్, అఖిబ్ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎదులాపురం, ఏప్రిల్ 20 : అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏ క్షణంలో ప్రమాదం సంభవించినా వెంటనే తమకు సమాచారం అందించాలని డీఎఫ్‌వో సురేశ్‌కుమార్ సూచించారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. అగ్ని ప్రమాదాల నివారణపై వారం పాటు జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆ శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో సత్కరించి వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ మేరకు డీఎఫ్‌వో సురేశ్ కుమార్ మాట్లాడుతూ..అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల ఉద్దేశాన్ని వివరించిన ఆయన..ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సేవలను గుర్తించి వారిని సత్కరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్, ఎమ్మార్వో రాజేశ్వర్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జగత్‌రామ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, ఏప్రిల్ 20 : రైతులు, పశు పోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశు వైద్య సిబ్బంది సూచించారు. ఆదివారం మండలంలోని సాత్ నంబర్, ఇస్లాంనగర్ గ్రామాల్లో పాడి పశువులు, ఎడ్లకు టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలన్నారు. టీకాలు ఉచితంగా వేస్తామని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది చంద్రశేఖర్, దేవరావు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంత్యుత్సవాలు

తాంసి, ఏప్రిల్ 20 : మండలంలోని ఘోట్కూరి గ్రామంలో అంబేద్కర్ జయంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవ చైతన్య యూత్ అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ విదేశాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసి జాతి గర్వించే స్థాయికి ఎదిగారని కొనియాడారు. కుల వివక్ష, దురాచారాలపై పోరాడారని, బడుగు, బలహీన వర్గాల వారిని ఈ కార్యక్రమంలో జగిత్యాల తహసీల్దార్ విశ్వంభర్, బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, తిరుమల్ గౌడ్, కేదారేశ్వర్ రెడ్డి, మాల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల మల్లయ్య, నవ చైతన్య నాయకులు నిమ్మల రవి, కిరణ్, విఠల్, నిమ్మల సురేశ్, రమాకాంత్, స్వామి, లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్ మాజీ ఉప సర్పంచ్ మృతి

జైనథ్, ఏప్రిల్ 20 : మండలంలోని లక్ష్మీపూర్ మాజీ ఉప సర్పంచ్ మాధవ్ మృతి చెందారు. కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధి తో బాధపడుతున్నారు. లక్ష్మీపూర్‌లో శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆదివారం నిర్వహించిన అంతక్రియల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు నివాళులర్పించారు. అంత్యక్రియల్లో మాజీ సర్పంచ్‌లు అడప తిరుపతి, భగత్ గౌతం, నాయకులు ఉన్నారు.

## వడూర్ వాసికి డాక్టరేట్

నేరడిగొండ, ఏప్రిల్ 20 : మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పురోహితుడు, వేదపండితుడు ఎల్కూచి శ్రావణ్‌కుమార్ (రాజుపంతులు)కి జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నాడు. జ్యోతిష్య శాస్త్రంతో పాటు ఆలస్య వివాహాలు, సంతానం అనే అంశం పైన పరిశోధన చేసినందుకు గాను ఈ అవార్డును సింహాచలం వేదికగా అందజేశారు. శుక్రాచార్య వేదిక్ యూనివర్సిటీ కర్ణాటక వారు డాక్టరేట్‌తో పాటు జ్యోతిష్య ఆచార్య శిరోమణి బిరుదును ప్రదానం చేశారు. దీంతో మండల వాసి అయిన వేదపండితులు శ్రావణ్‌కుమార్ డాక్టరేట్ పట్టాను అందుకోవడంతో ఆయనకు మండల వాసుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

## సివిల్ కేసులు పీవో వద్దనే పరిష్కరించాలి

ఉట్నూర్, ఏప్రిల్ 20: ఏజెన్సీ పరిధిలో సివిల్ కేసులు ఐటీడీఏ పీవో వద్దనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రాజ్ గోండ్ సేవా సమితీ రాష్ట్ర అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్ అన్నారు. ఆదివారం మంత్రి సీతక్కకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా ఐటీడీఏలో కొనసాగిన సివిల్ కేసులు హైకోర్టు తీర్పుతో 9 నెలలుగా నిలిచిపోయాయన్నారు. దీంతో ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తిరిగి గతంలో మాదిరిగా ఐటీడీఏ కార్యాలయంలోనే పరిష్కరించే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు పెందూర్ గోపి, చింతలు గిరి, కుడెల అశోక్ తదితరులు ఉన్నారు.

## వాహనాన్ని ఆపి..నగలు అపహరించి..

బేల, ఏప్రిల్ 20 : దారిగుండా వెళ్తున్న వాహనాన్ని ఆపి మహిళ దగ్గరున్న రెండు తులాల బంగారు నగలను దుండగులు అపహరించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు వివరాలను వెల్లడించారు. జైనథ్ మండలంలోని కౌటా గ్రామానికి చెందిన సంతోష్ వందన దంపతులు ద్విచక్ర వాహనంపై మాంగ్రూడ్‌లోని తమ బంధువుల పెళ్లికి వెళ్లి వస్తుండగా పాతన్ గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రోడ్డుపై ఎదురుగా ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనాన్ని ఆపారు. 'మేం పోలీసులం మీరు వెళ్లే దారిలో హత్య జరిగింది.. ఒకవేళ మీ వద్ద బంగారం ఉంటే తీసి ఇవ్వండి.. ఒక ప్యాకెట్‌లో పెట్టిస్తాం' అని చెప్పారు. వారి మాటలు నమ్మి తన వద్ద ఉన్న బంగారాన్ని మహిళ తీసి వారికి ఇచ్చింది. నగలు ప్యాకెట్లో పెట్టినట్లు చెప్పి ప్యాకెట్‌ను ఇచ్చి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత తీసి చూడగా అందులో బంగారానికి బదులు రాళ్లు ఉన్నాయి. వెంటనే దంపతులు బేల పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేయగా ఎస్ఐ దివ్య భారతి తమ సిబ్బందితో కలిసి సీసీ కెమెరాలను పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు రెండు టీమ్‌లను ఏర్పాటు చేశారు. రోడ్డుపై వాహనాలు ఆపిన వారు అనుమానాస్పదంగా డయల్ 100కి సమాచారం అందించాలని డీఎస్పీ సూచించారు. వీరి వెంట ఆదిలాబాద్ రూరర్ సీఐ కరుణాకర్ రావ్, ఎస్ఐ దివ్యభారతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్


భీంపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్, ఏప్రిల్20 : ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. భారత రాష్ట్ర సమితి రజతోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నార్నూర్, భీంపూర్, పూసిగూడ, మాన్కాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జడ్పీ మాజీ చైర్మన్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. 'జై తెలంగాణ..జై కేసీఆర్' అంటూ నినాదం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కరిలో చిరునవ్వును చూశామన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా అరకొర పథకాలను అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు త్వరలో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్ రావు, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తోడసం నాగోరావు, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

**రజతోత్సవాలను ఘనంగా నిర్వహించాలి**

నార్నూర్, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తోడసం నాగోరావ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేతరూప్‌దేవ్, పార్టీ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావు, మాజీ సర్పంచ్ మడావి రూప్‌దేవ్, మోడల్ పాఠశాల చైర్మన్ రాథోడ్ సుభాష్ తదితరులున్నారు.

**అభిమాని టీ స్టాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

నార్నూర్, ఏప్రిల్ 20 : ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో కేసీఆర్ అభిమాని చౌహాన్ విజయ్ ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం ప్రారంభించారు. ఇందవెల్లిలో అమరవీరుల సంస్మరణ సభకు వెళ్తుండగా నార్నూర్ మండల కేంద్రంలో ఆగి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నాయకులు, కార్యకర్తలున్నారు.


నార్నూర్‌లో జైతెలంగాణ..జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు


టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

## ఆదివాసీ సమాజానికి క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

ఎదులాపురం, ఏప్రిల్ 20: అమరుల స్తూపం సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి ఆదివాసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కర్కశత్వానికి ఆదివాసీ బిడ్డలు బలైన ఇంద్రవెల్లి ఘటనకు నేటికీ 44 ఏండ్లు అయిందన్నారు. అమరులైన అడవి బిడ్డలకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా కమిటీ తీవ్రమైన సంతాపం ప్రకటిస్తున్నదని తెలిపారు. 1981 సంవత్సరంలో కేంద్రంలో ఇందిరమ్మ ప్రధాన మంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అంజయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బ్రిటిష్ వారిని మించిపోయారన్నారు. ఆదివాసుల పైన మరో జాలియన్ వాలా బాగ్ లాంటి ఘటనకు పాల్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కుమ్ర రాజు, బీఆర్ఎస్ నాయకులు దయానంద్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజ్జగిరి నారాయణ

## విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో విద్య


విద్యార్థులకు బేంచీలు అందించిన మంత్రి సీతక్క

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 20: విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో విద్యను అందిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని దేవుగూడ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో బేంచీలు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, విదార్థులు, గ్రామస్తులు ఉన్నారు.

**యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి**

ఉట్నూర్, ఏప్రిల్ 20 : యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం స్థానిక కొమ్రం భీం ప్రాంగణంలో యూత్ ట్రెయినింగ్ సెంటర్ నిరుద్యోగులకు టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హేవీ మోటర్ వెహికిల్ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీ నగేశ్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండే విఠల్, ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ రాహుల్, వివిధ శాఖల అధికారులు, యువత పాల్గొన్నారు.

## కలెక్టర్ సమావేశాన్ని అడ్డుకుంటాం


మాట్లాడుతున్న కారేగాం గ్రామ యువకులు

ముథోల్, ఏప్రిల్, 20 : సోమవారం జరిగే భూ భారతి కార్యక్రమానికి మండలంలోని కారేగాం గ్రామానికి వస్తున్న జిల్లా కలెక్టర్ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని కారేగాం గ్రామస్తులు ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో ఇందిరమ్మ కమిటీ నియామకంలో ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారని తెలిపారు. దీంతో శనివారం మండల కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల అవగాహన సదస్సులో గ్రామసభలో తీర్మానించిన ఇద్దరి పేర్లు తొలగించి కొత్త పేర్లను చేర్పించడం ఏమిటని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి మొదట ఎన్నిక చేసిన పేర్లను కమిటీలో చేర్చాలని లేదంటే కలెక్టర్ భూ భారతి సమావేశాన్ని అడ్డుకుంటామని తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

బోథ్, ఏప్రిల్ 20 : బోథ్ మండలకేంద్రానికి చెందిన జక్కుల వెంకటేష్ తండ్రి రాం కిషన్ ఇటీవలే మృతి చెందారు. ఆదివారం రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ వారి ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు.

# వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు


బాసర : దగ్ధమైన లాండ్రీషాపు

**షార్ట్‌సర్క్యూట్‌తో జొన్న పంట దగ్ధం**

తలమడుగు, ఏప్రిల్ 20 : మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ఎంబడి రఘు అనే రైతు పొలంలో నిప్పంటుకొని రెండెకరాల్లోని జొన్న పంట కాలి బుడిదైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదవశత్తు విద్యుత్ ఘాతంతో నిప్పు రవ్వలు రావడంతో ఎండిన జొన్న పంటపై పడి నిప్పంటుకుందని తెలిపారు. జొన్న పంటతోపాటు పొలంలోని డ్రిప్పు పైపులు, మోటార్, ఇతర పైపులు కాలిపోయానని తెలిపారు. వీటి విలువ జొన్నతో పంటతో కలిపి రూ.లక్షా 50 వేల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలనిరైతు కోరుతున్నాడు.

**బాసరలో లాండ్రీషాప్ దగ్ధం**

బాసర, ఏప్రిల్ 20 : బాసరలోని బజార్ గల్లీలోని యోగేశ్ లాండ్రీ షాపులో విద్యుత్ సర్క్యూట్ జరిగి దగ్ధమైంది. వివరాల ప్రకారం..యోగేశ్ తన లాండ్రీ షాపులో షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో పెళ్లిళ్ల సీజన్ కావడంతో షాపులోని లక్షల విలువ గల బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితుడు యోగేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామ పంచాయతీ సిబ్బంది గమనించి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం విద్యుత్‌వాఖ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోలేదని గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కూడా ఈ విధంగానే గ్రామానికి చెందిన నవీన్ షాపులోని జనరల్ స్టోర్ పూర్తిగా విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో రోడ్డున పాడిన ఘటన జరిగింది.

**మూతపడిన సోయమిల్లు వద్ద అగ్ని ప్రమాదం**

ఎదులాపురం, ఏప్రిల్ 20: ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. వివరాల్లోకి వెళ్తే రాంపూర్ జాతీయ రహదారి పక్కన మూతపడి ఉన్న సోయ మిల్లు వద్ద చెత్తకు మంటలంటుకున్నాయి. మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్ సహాయంతో గంట పాటు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇందులో స్టేషన్ ఆఫీసర్ జయత్‌రామ్, సిబ్బంది తదితరులున్నారు.


తలమడుగు : దగ్ధమైన పంటను చూపిస్తున్న రైతు

**అగ్ని ప్రమాదంలో నీలగిరి చెట్ల దగ్ధం**


కడెం : కల్లెడలో కాలిన నీలగిరి చెట్లు

కడెం, ఏప్రిల్ 20: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన వెంబడి శేఖర్ చెందిన నీలగిరి తోటలో అగ్ని ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా మంటల చెలరేగడంతో 5 ఎకరాల్లో ఉన్న నీలగిరి తోటలోకి వ్యాపించడంతో చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయని రైతు శేఖర్ తెలిపారు. ఈ ప్రమాదం వల్ల తనకు రూ. 10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

## అ'పూర్వ' సమ్మేళనం

ఉట్నూర్, ఏప్రిల్ 20 : ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 1989-90 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమైన ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు.

**జైనథ్,** ఏప్రిల్ 20 : జైనథ్ హైస్కూల్లో 1997-2002 బ్యాచ్‌లకు సంబంధించిన పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.


ఉట్నూర్ జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


జైనథ్‌లో ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

## క్రైస్తవులకు 'ఈస్టర్ డే' శుభాకాంక్షలు తెలిపిన జాన్సన్ నాయక్


సీఎస్ఐ చర్చిలో పార్థనలు చేస్తున్న భూక్యా జాన్సన్ నాయక్

ఖానాపూర్, ఏప్రిల్ 20: ఖానాపూర్‌లోని సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ డే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారికి బీఆర్ఎస్ నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు ప్రదీప్, శ్రావణ్, మహిపాల్, అజయ్, క్రైస్తవులు ఉన్నారు.

**ఎదులాపురం, ఏప్రిల్ 20 :** ఆదిలాబాద్ పట్టణంలో ఈస్టర్ పండుగను ఘనంగా క్రైస్తవులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పలు చర్చిలలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పాస్టర్లు బైబిల్ సందేశాన్ని వినిపించారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డులో నిర్మల్ చిన్నారి


గిన్నిస్ సర్టిఫికెట్ అందుకుంటున్న శ్రీహితి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 20 : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో భారత్ ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో 4,737 మంది విద్యార్థులచే డిసెంబర్ 24న 2023లో నిర్వహించిన నృత్య ప్రదర్శన గిన్నిస్ రికార్డు నమోదు చేసిన విషయం విదితమే..నిర్మల్ పట్టణంలోని స్వరూపిణి నృత్య కళా క్షేత్రంలోని గురువు నవ్య పర్యవేక్షణలో 64 మంది చిన్నారులు పాల్గొని నృత్య ప్రదర్శన ఇచ్చారు. పట్టణానికి చెందిన ఆడెపు శ్రీహితికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు జారీ చేసిన సర్టిఫికెట్‌ను నిర్మల్ ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. గిన్నిస్ రికార్డులో చోటు సంపాదించుకున్న శ్రీహితితో పాటు ఆమె తల్లిదండ్రులను నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముత్యం రెడ్డి, నృత్య శిక్షకురాలు నవ్య తదితరులున్నారు.

## సార్వత్రిక పరీక్షలు ప్రారంభం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 20 : నిర్మల్ జిల్లా కేంద్రంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ సార్వత్రిక పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పదోతరగతి విద్యార్థుల కోసం 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా..464 మంది విద్యార్థులకు గాను 382 మంది విద్యార్థులు హాజరుకాగా 82 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.ఇంటర్మీడియట్ పరీక్షకు 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 439 మంది విద్యార్థులకు 383 మంది విద్యార్థులు హాజరుకాగా 56 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈవో రామారావు తెలిపారు. ఈద్గాం ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట పరీక్షల సహాయ కమిషనర్ పరమేశ్వర్, లింబాద్రి, తదితరులున్నారు.

## ఐసీడీఎస్ ఎక్స్‌టెన్సన్ ఆఫీసర్ల కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 20: తెలంగాణ ఎక్స్‌టెన్సన్ ఆఫీసర్స్ వుమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ నిర్మల్ జిల్లా కార్యవర్గం ఏర్పాటయింది. అధ్యక్షురాలిగా ఎన్. విజయగౌరి, ఉపాధ్యక్షులుగా అనిత, ప్రధాన కార్యదర్శిగా శ్రీలత, కోశాధికారిగా భాగ్యమతి, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మి విశారద, కార్యవర్గ సభ్యులుగా విజయలక్ష్మి, మంగళ, కవిత, జ్యోతి, శ్యామల, ప్రసన్న ఎన్నికయ్యారు. వీరిని జిల్లా సూపర్‌వైజర్లు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## టీజూడా రాష్ట్ర కమిటీకి ఎన్నిక

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 20: నిర్మల్‌కు చెందిన జూనియర్ డాక్టర్ శ్రీరాముల తేజ తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో ఇంటర్న్స్ అండ్ అండర్ గ్రాడ్యుయేట్ రాష్ట్ర ప్రతినిధిగా ఎంపికయ్యారు. శ్రీరాములతేజ గాంధీ మెడికల్ కాలేజీలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. గతంలో జూడాలు చేపట్టిన పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2020 బ్యాచ్‌కు రిప్రజెంటేటివ్‌గా ఉన్న శ్రీరాములు తేజకు అవకాశం రావడంపై పలువురు అభినందించారు.

## నిజాయితీ చాటుకున్న కండక్టర్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 20 : ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న పర్సును ప్రయాణికురాలికి అందించి బస్ కండక్టర్ తన నిజాయితీని చాటుకున్నారు. జగిత్యాల నుంచి నిర్మల్‌కు ప్రయాణిస్తున్న నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఆదివారం జగిత్యాలకు చెందిన మనోజ్ఞ ప్రయాణించింది. దిగేటప్పుడు పర్సు మరిచిపోయింది. కండక్టర్ శ్యామలకు పర్సు కనిపించడంతో తీసుకొని డిపోలోని క్లర్క్ ఎన్.ఆర్.శేఖర్‌కు అప్పగించింది. ఆదివారం పర్సుతో పాటు అందులో ఉన్న రూ.20 వేల విలువైన బంగారు చెవి కమ్మలను బాధితురాలైన మనోజ్ఞకు అందించారు. కండక్టర్‌ను డిపో మేనేజర్ కే. పండరి, ఉద్యోగులు అభినందించారు.

## మాజీ మంత్రి గడ్డెన్న వర్ధంతి

భైంసా, ఏప్రిల్, 20 : మాజీ మంత్రి గడ్డెన్న వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, నాయకులు మురళిగౌడ్, ఫారుఖ్ హైమద్, డా. దామోదర్ రెడ్డి, చౌండి రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

## నీట్ నమునా పరీక్ష

భైంసా, ఏప్రిల్ 20 : పట్టణంలోని డాక్టర్ రజనీకాంత్ టీజీఎల్‌ఏ ఆధ్వర్యంలో ఆదివారం నీట్ మాక్ నమునా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 100 మంది వరకు హాజరయ్యారు. ఇందులో డాక్టర్ రజనీకాంత్, వినోద్, తదితరులు ఉన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో 1230 వ ర్యాంకు

భైంసా, ఏప్రిల్, 20 : భైంసా పట్టణానికి చెందిన మణిరత్న జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియాలో 1230 వ ర్యాంకు సాధించాడు. ఇతను గతంలో పదవ తరగతి వరకు వేదం పాఠశాలలో చదువుకున్నాడు. ర్యాంకు సాధించడంపై ఉపాధ్యాయులు, పట్టణవాసులు అభినందించారు.

## అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 20 : నిర్మల్ పట్టణంలోని పెన్షనర్స్ సంఘ భవనంలో ఆదివారం అవోపా నిర్మల్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం జరిగింది. హైదరాబాద్ శ్రీకర్ హాస్పిటల్‌కు చెందిన డా. అన్వేష్ గౌడ్ బృందం 250 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న అవోపా సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అవోపా బాధ్యులు జొన్న వినోద్, టీ.నారాయణ, దయానంద్, అయిత రమణ, మంత్రి శ్రీనివాస్, పొలిశెట్టి విలాస్త్రీమాల, మాధవి, లావణ్య, తదితరులున్నారు.